క్లుప్తంగా

పొంచి ఉన్న ప్రమాదం



మరికల్: మండలంలోని పెద్దచింతకుంటలో వేప చెట్టు పక్కనే విద్యుత్ స్తంభం ఉంది. ట్రాన్స్‌కో అధికారులు స్పందించి ప్రమాదం జరగక ముందే అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలకు తగిలి షార్ట్‌సర్క్యూట్ వచ్చే అవకాశాలు ఉన్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులకు వనభోజనం



ధన్వాడ: మండల కేంద్రంలో చైతన్య ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో విద్యార్థులకు వనభోజనం నిర్వహించారు. శుక్రవారం ధన్వాడ శివారులోని భరత గట్టుకు తీసుకెళ్లి విద్యార్థులకు వృక్షాలు, ప్రకృతి గురించి వివరించారు. అనంతరం అక్కడే చెట్లకింద భోజనం చేశారు. ఇందులో ప్రిన్సిపాల్ కాశయ్య, చంద్రకాంత్, భరత్, కల్పన, సరిత, రవి, సుధాకర్, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

తీలేర్‌లో అయ్యప్ప మహాపడిపూజ



మరికల్: మండలంలోని తీలేర్ రేణుక ఎల్లమ్మ ఆలయ ఆవరణలో శుక్రవారం ఘనంగా అయ్యప్ప మహాపడిపూజ కార్యక్రమం నిర్వహించారు. గురుస్వాములు స్వామివారి 18 మెట్ల పడితో పాటు గణపతి, అయ్యప్ప, కుమరస్వామి చిత్రపటాలకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పోటీపడి అయ్యప్ప గీతాలను ఆలపించారు. అనంతరం భక్తులకు, గ్రామస్తులకు తీర్థప్రసాదలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

స్వీట్ల పంపిణీ



ధన్వాడ: నారాయణపేట నియోజకవర్గ ఎమ్మెల్యేగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పర్ణికరెడ్డి గెలుపొందడంపై సంతోషం వ్యక్తం చేస్తూ.. మండల కేంద్రంలోని జామమసీద్‌లో కాంగ్రెస్ పార్టీ మైనర్టీ సెల్ ఆధ్వర్యంలో స్వీట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఖాజాపాషా మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట నిలపెట్టుకుంటుందని నేటి నుంచి మహిళలకు ఉచితంగా బస్ ప్రయాణం ప్రారంభిస్తుందని అన్నారు. ఇందులో జలిల్‌పాషా, యూసుఫ్, ఖదిర్, ఆషారఫ్, రహిమన్‌ఖాన్, పాషా తదితరులు ఉన్నారు.

నర్సరీ పరిశీలన



ఊట్కూరు: మండలంలోని నాగిరెడ్డిపల్లిలోని నర్సరీని శుక్రవారం ఎంపీడీఓ రమేష్‌కుమార్ పరిశీలించారు. నర్సరీలో పెంచుతున్న మొక్కల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నర్సరీలో ఖాళీగా బెడ్‌లో విత్తనాలు నాటాలని, రోజూ విధిగా నీరు పెట్టాలని సూచించారు. వచ్చే ఏడాది వర్షాకాలం ప్రారంభానికి మొక్కలను సిద్ధం చేయాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఈసీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నీటి వృథాను అరికట్టండి



మాగనూర్: గ్రామాల్లో తాగడానికి నీరు లేక ప్రజలు ఇబ్బంది పడుతుంటే.. మరికొన్ని గ్రామాల్లో మాత్రం ఆ నీటి విలువ తెలియక వృథాగా వదిలేస్తున్నారు. మండల పరిధిలోని అమ్మపల్లిలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా తాగునీరు వృథా చేస్తున్నారు. దీంతో పరిసరాలు మొత్తం అపరిశుభ్రంగా మారి దోమల బెడద ఏర్పడుతుందని పలువురు ఆరోపిస్తున్నారు. అంతే కాకుండా నీటి కాలుష్యం ఏర్పడుతుందని వాపోతున్నారు. అధికారులు స్పందించి తాగనీటి వృథాను అరికట్టాలను కోరుతున్నారు.

ఆధునికీకరణ జరిగేనా..!

- గత ప్రభుత్వం నుంచి మరికల్ బస్టాండ్‌కు రూ.1.20 కోట్లు మంజూరు
- ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రారంభం కాని పనులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రయాణికులు



మరికల్ ఆర్టీసీ బస్టాండ్

మరికల్: మరికల్ ఆర్టీసీ బస్టాండ్ రూపురేఖలు మార్చేందుకు గత ప్రభుత్వం నుంచి రూ.1.20 కోట్లను మంజూరు చేసింది. అయితే ఎన్నికల కోడ్ నేపథ్యంలో పనులు ప్రారంభం కాలేదు. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో బస్టాండ్ మరమ్మతులు కొనసాగుతాయా లేదా అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. 35 సంవత్సరాల తర్వాత మరికల్ ఆర్టీసీ బస్టాండ్‌కు మహర్దశ వచ్చింది. గతేడాది జరిగిన అసెంబ్లీ సమావేశంలో మరికల్ బస్టాండ్ మరమ్మతుల విషయంపై అప్పటి ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి సభలో సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఆర్టీసీ బస్టాండ్ ఆధునీకరణ కోసం సీడీపీ నిధుల కింద రూ.1.20 కోట్లు మంజూరయ్యాయి. బస్టాండ్ ప్రాంగణంలోకి వర్షపునీరు రాకుండా పక్కాగా డ్రెయినేజీ, సీసీరోడ్లు, ప్రయాణికుల సౌకర్యార్థం నాణ్యమైన పర్నీచర్, నీటి వసతి, ప్లాట్ ఫారం విస్తరణ, క్యాంటిన్‌పై ఉన్న రేకులను తొలగించి చెత్తు వేయాలని అధికారులు నిర్దేశించారు. అన్ని హంగులతో బస్టాండ్‌ను ఆధునీకరణ చేయాలని భావించారు.

జిల్లా ముఖద్వారం...

కొత్తగా ఏర్పాటైన నారాయణపేట జిల్లాకు మరికల్ ముఖద్వారం వంటింది. మరికల్ మీదుగా గుల్బర్గా, నారాయణపేట, మక్తల్, రాయచూర్, గద్వాల, హైదరాబాద్, నల్గొండ, మహబూబ్‌నగర్, గుంటురు, హంబ్లీ, గోవ తదితర పట్టణాలకు నిత్యం వందల సంఖ్యలో బస్సుల రాకపోకలు కొనసాగిస్తున్నారు. 35 ఏళ్ల కిందట నిర్మించిన బస్టాండ్ ప్రస్తుతం శిథిలావస్థకు చేరడంతో ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్న సమయంలో మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయి. ప్రస్తుత ఎమ్మెల్యే చొరవ తీసుకొని మరికల్ ఆర్టీసీ బస్టాండ్ ఆధునీకరణ పనులు చేపట్టాల్సింది ఎంతైనా ఉందని ప్రయాణికులు కోరుతున్నారు.

తప్పకుండా పనులు ప్రారంభించాలి



35 ఏళ్ల నుంచి అనేక సమస్యలతో ఉన్న మరికల్ ఆర్టీసీ బస్టాండ్ రూపురేఖలు మార్చేందుకు గత ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో ఆధునీకరణ పనులు ప్రారంభించాలి. ఇప్పటికే సరైన మరుగుదొడ్లు లేక మహిళ ప్రయాణికులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలగే వర్షపు నీరు వెళ్లడానికి డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో బస్టాండ్ ప్రాంగణంలో నీరు నిలవడంతో గుంతలు ఏర్పడి బస్సుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ప్రస్తుత ఎమ్మెల్యే ఈ పనులు పెండింగ్‌లో పెట్టకుండా చేపట్టాలి.

– కుర్మయ్య, మరికల్

కొత్త ఎమ్మెల్యే చొరవచూపాలి..



నారాయణపేట జిల్లాకు ముఖద్వారంగా ఉన్న మరికల్ బస్టాండ్ మరమ్మతులపై కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యే దృష్టి సారించాలి. గత ప్రభుత్వం రూ.1.20 కోట్లతో బస్టాండ్ ఆధునీకరణ పనులకు ఈ ఏడాది మార్చిలో శంకుస్థాపన చేశారు. పనులు అలస్యం కావడం, ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిచిపోయాయి. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని అవే నిధులతో అన్ని మౌలిక వసతులతో ఆధునీకరణ పనులు చేపట్టాలి.

– తిరుపతయ్య, అప్పంపల్లి

మరోసారి ఉన్నత అధికారులతో చర్చిస్తాం..

ఎన్నికల కారణంగా వాయిదా పడిన మరికల్ ఆర్టీసీ బస్టాండ్ మరమ్మతు పనుల విషయాన్ని తమ ఉన్నత అధికారులతో చర్చించాల్సి ఉంది. ఈ పనులు పంచాయతీరాజ్ అధికారుల ఆధీనంలో ఉన్నాయి. వారిని కూడా సంప్రదించి పనులు కొనసాగేలా చర్యలు తీసుకుంటాం.

– లక్ష్మీసుధ, ఆర్టీసీ డీఎం నారాయణపేట

ప్రమాదకరంగా వంతెన



పెద్దకడ్మూర్ వద్ద ప్రమాకరమైన ఇరుకైన వంతెన

నర్వ: మండలంలోని పెద్దకడ్మూర్ వద్ద కొన్నేళ్లుగా నిర్మాణం చేసిన ఇరుకైన వంతెన నిర్మాణం ప్రమాదకరంగా మారిందని ప్రయాణికులు వాపోతున్నారు. ఈ వంతెనకు ఇరువైపుల ఉన్న రక్షణ రాళ్లు పడిపోవడం, వంతెన పూర్తిగా దెబ్బతిని వంతెనపై గోతులు పడి ప్రయాణం ప్రమాదకరంగా మరిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఈ బ్రిడ్జిపై ప్రమాదాలు చోటు చేసుకున్నట్లు తెలిపారు. రెండు మార్లు గద్వాల, మక్తల్ రహదారిని మరమ్మతు చేసి రోడ్డు వేశారు తప్పా.. ఈ మార్గంలో ఉన్న కొండదొడ్డి, పెద్దకడ్మూర్‌ల వద్ద ఉన్న ఈ బ్రిడ్జిలపై ఎలాంటి మరమ్మతు చేపట్టకపోవడంతో రోజురోజుకు బ్రిడ్జి నాణ్యత దెబ్బతిని గోతులు ఏర్పడుతున్నాయని వాపోతున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం రోడ్డు వేస్తుండగా.. ఈ బ్రిడ్జిలపై సీసీ రహదారి లేదా తారు రోడ్డు వేస్తే ప్రయాణ ఇబ్బందులు తీరుతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్ ఈ పనులు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పట్టపగలు నిరంతర వెలుగులు



వడ్వాట్‌లో పగలే వెలుగుతున్న విద్యుత్ బల్బు

మాగనూర్: మండలంలోని పలు గ్రామాల్లో పట్టపగలు విద్యుత్ దీపాలు వెలుగులు విరజిమ్ముతున్నాయి. నిరంతరాయంగా బల్బులు వెలగడంతో విద్యుత్ వృథా అవుతుందని, ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలలోని వడ్వాట్, అమ్మపల్లి, గజ్జరందొడ్డి, మందిపల్లి, నెరడగండొడ్డి, కొత్తపల్లి, మాగనూర్ తదితర గ్రామాల్లోని పలు కాలనీల్లో 24 గంటల పాటు విద్యుత్ దీపాలు వెలుగుతున్నా.. సంబంధిత అధికారులు చూసి, చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. సాయంత్రం వీధి దీపాలను ఆన్ చేసి ఉదయం బంద్ చేయాల్సి ఉన్నప్పటికీ, ఆ దిశగా అధికారులు, విద్యుత్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ వృథాను అరికట్టాలని కోరుతున్నారు.

నేడు సోనియాగాంధీ జన్మదిన వేడుకలు

నారాయణపేట/ నర్వ: నియోజకవర్గ కేంద్రం, నర్వ మండల కేంద్రంలో సోనియాగాంధీ జన్మదిన వేడుకలను శనివారం నిర్వహించనున్నట్లు నారాయణపేట కౌన్సిలర్ ఎండీ సలీం, కాంగ్రెస్ పార్టీ నర్వ మండల అధ్యక్షుడు బీసం చెన్నయ్యసాగర్ తెలియజేశారు. ఉదయం పదకొండు గంటలకు జిల్లా కేంద్రంలోని డీసీసీ కార్యాలయంలో(సీవీర్ భవనంలో) కేక్ కట్ చేసి జన్మదిన వేడకలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో మండలంలోని ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఆయా గ్రామాల కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

కార్యకర్తలకు అండగా ఉంటా..

దామరగిద్ద: మండల కేంద్రంలోని బీజేపీ కార్యకర్తలను ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి రతంగ్‌పాండ్ రెడ్డి కలిశారు. తనకు ఓట్లు వేసిన నాయకులు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలపారు. అధికార పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రజా సంక్షేమ పథకాలు అందడంలో నిర్లక్ష్యం వహిస్తే ప్రజల పక్షాన పోరాటం చేసేందుకు బీజేపీ సిద్ధంగా ఉంటుందన్నారు. పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఎల్లప్పుడు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

ప్రభుత్వ ఆస్పత్రి భవనం శిథిలం



మక్తల్‌లో మరమ్మతులు చేపట్టకుండా రంగులు వేసిన పాతభవనం

- వర్షం వస్తే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న రోగులు
- 30 పడుకలకు కొన్ని మంచాలతోనే సరి
- పట్టించుకోని అధికారులు



మక్తల్‌లో శిథిలావస్థకు చేరిన సబ్‌సెంటర్

మక్తల్: నిజాం కాలంలో నిర్మించిన భవనాలకు నేటి వరకు వాటికి మరమ్మతులు చేపట్టడంలేదు. గతంలో పాత భవనానికి రంగులు పూసి చేతులు దులుపుకొన్నారు. మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రిలో ముగ్గురు వైద్యులు, ఇద్దరు ఫార్మసిస్టులు, ఐదుగురు స్టాఫ్‌నర్సులు, 20 మంది వైద్య సిబ్బంది పనిచేస్తున్నారు. ప్రతి రోజూ 250 మంది రోగులు చికిత్సలు చేయించుకుంటున్నారు. సిబ్బంది, స్వీపర్లు 12 మంది పని చేస్తున్నారు. కర్ని ఆస్పత్రి నుంచి వైద్య సిబ్బంది ఇక్కడ ఉండి పనులు చేస్తున్నారు. 30 పడకల ఆస్పత్రి ఉన్నప్పటికీ స్థలం లేకపోవడంతో కేవలం కొన్ని మంచాలు మాత్రమే ఉంటున్నాయి. వైద్యులకు ఒక గది మాత్రమే ఉంటుంది. అదే గదిలో పేషెంట్లకు చికిత్సలు చేస్తున్నారు.

- మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో ప్రభుత్వ భవనాలు రూ.లక్షలతో హంగులు ఆర్భాటాలతో ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసి వదిలేశారు. మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణం నిజాం కాలంలో చేపట్టారు. భవనం లోపల పెచ్చులు ఊడిపోవడంతో పాత వాటికి రంగులు వేసి చేతులు దులుపుకొన్నారు. వర్షాకాలంలో గోడలు తేమ రావడంతో ఉరుస్తుంది. దీంతో రాత్రి సమయంలో ఏమాత్రం రక్షణ లేకుండా పోయింది. వైద్యులు ఉండాలంటే భయాందోళన చెందుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలోని సబ్‌సెంటర్ బాలెంతల కోసం ఏన్నో ఏళ్ల కిందట నిర్మాణం చేసినప్పటికీ భవనం మరమ్మతులు చేయడం లేదు. బాలెంతలకు చికిత్సలు చేయాలంటే వేరొక గదిలో ఉండి చికిత్సలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. జిల్లా ఉన్నత అధికారులకు చర్యలు తీసుకోవాలని చెప్పినా ఫలితం లేకుండా పోయింది. సంబంధిత వైద్యులు మాత్రం ఆస్పత్రిలో చికిత్సలు చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రికి మరమ్మతు పనుల కోసం రూ.10లక్షలు మంజూరు చేసినా.. పోస్టుమార్టం గదికి మాత్రం నిధులు మంజూరు చేయడం లేదు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో దాదాపు కేవలం పది మంచాల వరకు పరిమితం ఉందని, స్థలం లేకపోవడంతో రోగులకు మంచాలు వేయలేని పరిస్థితి నెలకొంది. మరుగుదొడ్లకు మరమ్మతులు చేయకపోవడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. భవనాలు నిరుపయోగంగా మారుతున్నప్పటికీ అధికారులు చర్యలు చేపట్టడం లేదు.

నిధులు మంజూరు చేయండి..



మక్తల్‌లో నిజాంకాలం నాటి భవనానికి మరమ్మతులు చేపట్టడంలేదు. దీంతో శిథిలవస్థకు చేరుకుంది. ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయాలి. అధికారులు మాత్రం రంగులు వేసేందుకు నిధులు మంజూరు చేసి చేతులు దులుపుకొన్నారు. వర్షం వస్తే భవనం కురుస్తుంది. రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

– కిరణ్, మక్తల్

త్వరలో వంద పడకల ఆస్పత్రి చేయాలి..



మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రిని వంద పడుకల ఆస్పత్రిగా త్వరలో నిర్మాణం చేయాలి. రోగులకు ఇబ్బందులు లేకుండా చూడాలి. రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అధికారులకు తెలిపినా పట్టించుకోవడంలేదు.

– నర్సింహులు, ముస్టిపల్లి

ఉన్నతాధికారులకు తెలియజేస్తాం..

మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రిలో సమస్యల విషయమై ఉన్నత అధికారులకు తెలియజేస్తాం. మక్తల్‌కు 150 పడుకల ఆస్పత్రిని ప్రభుత్వం మంజూరు చేసింది. రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చికిత్సలు చేస్తున్నాం. భవనం మరమ్మతు చేయాలని అధికారులకు తెలియజేస్తాం.

– డాక్టర్ చక్రధర్‌గౌడ్, మక్తల్

స్థానిక సంస్థల్లో బీజేపీ సత్తా చాటుదాం..



మక్తల్‌లో మాట్లాడుతున్న బీజేపీ కార్యవర్గ సభ్యుడు మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి

మక్తల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా ఎమిటో చూపిద్దామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి, కొండయ్య అన్నారు. శుక్రవారం మక్తల్‌లో బీజేపీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. బీజేపీ గెలుపు కోసం కృషి చేయడంపై కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించాలని కోరారు. కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్‌లో జరగబోయే స్థానిక సంస్థలను దృష్టిలో ఉంచుకొని పని చేయాలని కోరారు. మక్తల్ నియోజకవర్గంలో ప్రజల కోసం నిరంతరంగా పనిచేసి ప్రజల మధ్యనే ఉంటానని అన్నారు. తాను ఎన్నికల్లో ఓడిపోయిన ప్రజల తీర్పును శిరసావహిస్తానని అన్నారు. ప్రజల మధ్యనే ఉండి ప్రజలకు సేవ చేస్తానన్నారు. తన కోసం కృషి చేసిన కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులకు ప్రత్యేకంగా ధన్యవాదలు తెలియజేశారు. నరేంద్రమోదీ చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీ, ఎంపీపీ శ్యామలమ్మ, వైస్‌చైర్మన్ అఖిల్‌రెడ్డి, ఎంపీటీసీ బాల్‌రాంరెడ్డి, కౌన్సిలర్ అర్చన, అసెంబ్లీ కన్వీనర్ కర్ని స్వామి, రాజశేఖర్‌రెడ్డి, మల్లికార్జున్, కనకరాజు, రవీందర్‌రెడ్డి, మేర్వరాజు, శ్రీను, అశ్విన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటా'..

ఊట్కూరు: అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన తాను నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటానని బీజేపీ రాష్ట్ర నాయకుడు జలంధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఎన్నికల అనంతరం ఊట్కూరులో పలువురు బీజేపీ కార్యకర్తలను కలిశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో ఓటమి గెలుపులు సహజమని, ఎన్నికల్లో తనకు ఓటు వేసిన వారందరికీ అభినందనలు తెలిపారు. నిత్యం ప్రజల మధ్యలో ఉంటూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యకర్తలకు అండగా ఉంటూ.. గ్రామస్థాయిలో పార్టీని పటిష్ఠ పరుస్తానని తెలిపారు. ఎన్నికల్లో ఓడినందుకు కార్యకర్తలు నిరుత్సాహ పడవద్దని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు, నాయకులు కార్యాచరణ నూతన ఉత్సాహంతో ప్రారంభించాలని అన్నారు. స్థానికి సంస్థల ఎన్నికల్లో ప్రతి గ్రామంలో బీజేపీ జెండాను ఎగురవేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆయన వెంట జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్, నాయకులు గంగాధర్‌గౌడ్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

అధికారుల అండదండలు



కొనసాగుతున్న ఇటుక బట్టీ పనులు

కృష్ణా: మండలంలోని హిందుపూర్ శివారోలోని మహారాష్ట్ర కాంట్రాక్టర్లకు చెందిన ఇటుకల బట్టీలో శుక్రవారం మళ్లీ పనులు ప్రారంభమయ్యాయి. కేవలం రెండు రోజులు మాత్రమే బంద్ చేసినట్లు నటించి నిర్వాహకులు మళ్లీ పనులు ప్రారంభించారు. ఇటుకల బట్టీలకు ఎలాంటి అనుమతులు లేవని, అనుమతులు వచ్చే వరకు పనులు నిలిపివేయాలని తహసీల్దార్ ఆదేశించి రెండు రోజులు గడవకముందే.. అప్పుడే వాటికి అనుమతులు వచ్చాయా అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఇటుకల బట్టీల నిర్వాహకులు రెవెన్యూ అధికారులతో లోపాయికారిగా కుదుర్చుకున్న ఒప్పందంతో మళ్లీ పనులు ప్రారంభించారని ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయంపై తహసీల్దార్ దయాకర్‌రెడ్డిని వివరణ కోరగా.. మొత్తం బట్టీల్లో పనులు నిలిపివేయాలని నేను ఆర్ఐ అమర్‌నాథ్‌రెడ్డిని ఆదేశించానని, పనులు ప్రారంభించిన విషయం తెలియదని చెప్పారు.

చదవాలంటే నడవాల్సిందేనా

- రోడ్డున్నా బస్సులు కరువు
- కాలినడకన వెళ్తున్న విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు



వాడ్వట్ ఉన్నత పాఠశాల నుంచి నడిచి వెళ్తున్న విద్యార్థినులు

మాగనూర్: గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానికంగా ఉన్నత పాఠశాలలు లేకపోవడంతో శివారు గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివేందుకు సుమారు ఐదారు కిలోమీటర్లు కాలినడకన వెళ్తున్నారు. మండలంలోని మాగనూర్, నెరడగం, వాడ్వట్‌లో ఉన్న ఉన్నత పాఠశాలలకు వెళ్తున్నారు. మాగనూర్, నేరడగం గ్రామాలకు చుట్టుపక్క గ్రామాల నుంచి బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రతిరోజూ కాలినడకన వెళ్తున్నారు. మరో వైపు వాడ్వట్ పాఠశాలల రూట్‌లో ఒకే బస్సు తిరుగుతుండటంతో విద్యార్థులు ఒంటి పూట బడులతో సమయానికి బస్సులు లేక కాలినడకన వెళ్తూ.. ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్సు సౌకర్యం కల్పించి విద్యార్థుల ఇబ్బందులు తీర్చాలని కోరుతున్నారు.

సూగురేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



సూగురేశ్వర మూలవిరాట్



ముస్తాబైన స్వామి వారి జోడు రథోత్సవాలు

కృష్ణా: మండల సరిహద్దులోని దేవసూగూర్‌లో వెలిసిన సూగురేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 12 నుంచి ప్రారంభమై 22 వరకు కొనసాగనున్నాయి. ఈ సందర్భంగా అర్చకులు విలేకరులతో మాట్లాడారు. 16న శనివారం ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం, బిల్వార్చన, అలంకారం, మహా మంగళహారతి కార్యక్రమాలు, 17న ఆదివారం సాయంత్రం ప్రభోత్సవం, వేదగోష నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. 18న సోమవారం ఉదయం అలంకరణ, రుద్రాభిషేకం, సాయంత్రం జోడు రథోత్సవం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉత్సవాలకు కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్ర నుంచి వేలాది మంది భక్తులు హాజరవుతున్నట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా.. తాగునీరు, వసతి, భోజన సౌకర్యాలు సమకూర్చినట్లు వివరించారు.

ఆకట్టుకున్న ఫుడ్ ఫెస్టివల్

కోస్గి: శాంతినికేతన్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఫుడ్ ఫెస్టివల్ పేరుతో విద్యార్థులు నిర్వహించిన కార్యక్రమం ఎంతగానో ఆకట్టుకుంది. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ఉత్తర భారతదేశం, దక్షిణ భారతదేశం ప్రాంతాల్లో ప్రజలు నిత్యం తినే వివిధ రకాల ఆహార పదార్థాలను 60కి పైగా ప్రదర్శించారు. ఆయా ఆహార పదార్థాలను తయారు చేసే విధానం, వాడే సామగ్రి, ఇతర అంశాలను సందర్శకులకు వివరించారు. సందర్శకులు పదార్థాల రుచి చూసి విద్యార్థులను అభినందించారు.

కేంద్రీయ విద్యాలయంలో కొలువు

కోస్గి: మండలంలోని పీసీ తండాకు చెందిన యువకుడు శ్రీనివాస్ నాయక్ కేంద్రియ పాఠశాల ఉపాధ్యాయుడిగా ఎన్నికయ్యాడు. ఎస్టీ కెటగిరీలో జాతీయ స్థాయిలో 3వ ర్యాంకు సాధించి కేంద్ర ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యాడు. శ్రీనివాస్ నాయక్‌కు విశాఖపట్నంలోని కేంద్రియ విద్యాలయంలో పోస్టింగ్ ఇచ్చారు. శ్రీనివాస్ నాయక్ తండ్రి నార్యా నాయక్ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు.